

బదిలీలు చేపట్టాలి

నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లకు జిల్లాస్థాయిలోనే బదిలీలు చేపట్టాలని ట్రెసా ప్రతినిధులు మంత్రిని కోరారు.

- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.1 /23.5

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సేవలు మరువలేనివి



ఖలీల్‌వాడి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సేవలను మరువలేనివని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం వైఎస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజల అభివృద్ధి గురించి ఆలోచించిన వ్యక్తి అన్నారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని పేర్కొన్నారు. జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, గుత్ప ఎత్తిపోతల పథకం వైఎస్సార్ హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, మహిళా కాంగ్రెస్ నాయకులు చంద్రకళ, స్వామిగౌడ్, సాయిలు, లవంగ ప్రమోద్ పాల్గొన్నారు.

28న ఊరపండుగ జరుపుకోవాలి: యెండల



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలో ఆషాఢ మాసంలో ఆనవాయితీగా జరుపుకునే ఊరపండుగను ఈ నెల 28న నిర్వహించుకోవాలని సర్వసమాజ్ అధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ రోజు చేసుకునే ఇందూరు ఊర పండుగ నాడు గురుపౌర్ణమి వచ్చిందన్నారు. దీంతో మరుసటి రోజు ఆదివారం ఊర పండుగ నిర్వహించుకునేలా సర్వసమాజ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. నగరవాసులు ఈ నిర్ణయం మేరకు ఊరపండుగలో పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నిజామాబాద్‌నాగారం: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. సోమవా రం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీల పరిధిలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ మిగతా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని వైరల్ ఫీవర్లు ప్రబలకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరికీ గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను, సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మకరందు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్, డిస్ట్రిక్ట్ ఎమినేషన్ అధికారి అశోక్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఈవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఫలించిన నిరీక్షణ

- రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల నియామకాల జీవో విడుదల
- ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి చైర్మన్ పీఠాలు
- బాల్కొండ నియోజకవర్గం నుంచే ముగ్గురికి కార్పొరేషన్ పదవులు
- గతంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ



మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, కాసుల బాల్‌రాజ్, అన్వేష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులకు ఒక్క అడుగు దూరంలో ఉన్న వారి నిరీక్షణ ఫలించింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ విడుదలకు కొన్ని గంటల ముందు గత మార్చి 17న విడుదల చేసిన పదవుల జాబితాకు సంబంధించిన జీవోను ప్రభుత్వం సోమ వారం ప్రకటించింది. దీంతో దాదాపు మూడు నెలల పాటు ఎదురుచూపులు చూస్తున్న తమకు తీపికబురు అందిందని పదవులు పొందినవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కగా, ఇందులో ముగ్గురు ఒక్క బాల్కొండ నియోజకవర్గం నుంచే ఉండడం గమనార్హం. నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ పదవి వచ్చింది. మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకేట అన్వేష్ రెడ్డికి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవులు దక్కాయి. వీరు ముగ్గురూ బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వారే కావడం విశేషం. వీళ్లతో పాటు బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాసుల బాలరాజుకు తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి లభించింది. పదవులు దక్కిన వారిలో ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా కొన్ని నెలల క్రితం జిల్లాకు చెందిన తాహెర్‌బిన్ హందాన్‌ను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

మరికొందరికి తప్పని ఎదురుచూపులు

నామినేటెడ్ పదవుల కోసం జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు కళ్లు కాయుల కాసేలా ఎదురు చూస్తున్నారు. నామినేటెడ్ రేసులో ఉన్నవారిలో 20 నుంచి 30 ఏళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వారున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులైన పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, నిజామాబాద్ నగర పార్టీ అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడు గు గంగాధర్, నగేశ్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణు గోపాల్‌యాదవ్, మైనారిటీ నాయకుడు సయ్యద్ ఖైసర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజనరేందర్‌గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వైశాఖ సంతోష్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, విక్కీ యాదవ్, రంగు అనిల్ గౌడ్ నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా జిల్లాలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులకు సంబంధించి నుడా చైర్మన్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మరికొందరికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇక స్థానిక సంస్థల్లో కీలకమైన జెడ్పీ చైర్మన్, నిజామాబాద్ మేయర్, మున్సిపాలిటీల చైర్మన్ పదవుల విషయంలోనూ పార్టీ నాయకత్వం ఎవరికి అవకాశాలు ఇవ్వాలనే విషయమై ఆలోచన చేస్తుండడం గమనార్హం.

బాధ్యతల స్వీకరణ



ఖలీల్ వాడి: తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్, విత్తన అభివద్ధి సంస్థ చైర్మన్‌గా అన్వేష్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తమ చాంబర్‌లలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, జిల్లా డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి, మెండోరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం రెడ్డి పాల్గొన్నారు.

అటవీశాఖలో అయోమయం!



- ఉద్యోగ బదిలీల్లో పర్సంటేజీపై స్పష్టత కరువు
- 40 శాతమే పరిగణనలోకి తీసుకుంటే జూనియర్లకు నిరాశే..
- మూడేళ్లు నిండిన వారందరికీ స్థానచలనం చేయాలని పట్టు

డొంకేశ్వర్(ఆర్మూర్): అటవీశాఖ ఉద్యోగ బదిలీల్లో అయోమయం నెలకొంది. శాఖలో ఎక్కువ మొత్తంలో ఉద్యోగులు ఉండడంతో బదిలీల విషయంలో కొంత గందరగోళం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను పరిశీలిస్తే అటవీశాఖలో 90శాతం మంది ఉద్యోగులు మూడు నుంచి ఆరేళ్ల వరకు ఒకేచోట పనిచేస్తున్నారు. బదిలీలకు వీరందరూ అర్హులే. కానీ, 40 శాతం నిబంధనతో కొందరికే స్థానచలనం జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే 40 శాతంతో కేవలం సీనియర్లకే అవకాశం లభిస్తుంది. దీనివలన ఐదేళ్లు పూర్తి చేసుకున్న జూనియర్లు కదల్లేని పరిస్థితి నెలకొంది. దీంతో జూనియర్ ఉద్యోగులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీలు తమదాకా వచ్చి ఆగిపోవడంపై అసంతృప్తిగా ఉన్నారు. అయితే యూనిఫాం డిపార్ట్‌మెంట్‌గా పిలువబడే అటవీ శాఖకు ఉద్యోగ బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగ సంఘ నాయకులు ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు సమాచారం. పరిమితులు పెట్టకుండా మూడేళ్లు నిండిన వారందరికీ స్థానచలనం కల్పించాలని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి త్వరలోనే నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలున్నట్లు జిల్లాకు చెందిన అటవీ శాఖ ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. జిల్లా అటవీ శాఖలో ఎఫ్‌ఆర్వోలు, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు కలిపి దాదాపు 112 మంది పని చేస్తున్నారు. అత్యధికంగా 75 మంది బీట్ ఆఫీసర్లు ఉన్నారు. డీఆర్వోలకు సీసీఎఫ్ స్థాయిలో, ఎఫ్ఆర్వోలకు పీసీసీఎఫ్ స్థాయిలో, బీట్ ఆఫీసర్లకు డీఎఫ్‌వో స్థాయిలో బదిలీ కౌన్సెలింగ్ చేయాల్సి ఉంది. అయితే, ఎఫ్‌ఆర్వోలకు బాసర జోన్‌కు చెందిన ఒక సీనియర్ సీసీఎఫ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో బదిలీలను చేపట్టనున్నట్లు తెలిసింది.

బీట్ ఆఫీసర్లదే అసలు సమస్య..

బదిలీల ప్రక్రియలో బీట్ ఆఫీసర్ల విషయంలో స్పష్టత రావడం లేదు. జిల్లాలో మొత్తం 75 మంది బీట్ ఆఫీసర్లు ఉన్నారు. అత్యధిక అటవీ విస్తీర్ణం ఉన్న బీట్లలో రెండేళ్లు, తక్కువ అటవీ విస్తీర్ణం గల బీట్లలో మూడేళ్లు గరిష్ఠంగా పని చేయాలని నిబంధనలున్నాయి. ఈ నిబంధనల ప్రకారం అందరూ తమ పరిధిలో ఐదేళ్లకు పైగా పని చేశారు. 40 శాతం పరిమితితో బదిలీలు చేపడితే సీనియారిటీ కలిగిన 28 మందికి స్థానచలనం కలుగుతుంది. మిగిలిన 47 మంది బీట్ ఆఫీసర్లు బదిలీలకు నోచుకోరు. అందుకే పూర్తిశాతం బదిలీలు చేపట్టాలని బీట్ ఆఫీసర్లు కోరుతున్నారు.

అయోమయంలో రేషన్ దరఖాస్తుదారులు

- కార్డుల్లో మార్పులు, చేర్పులపై రాని స్పష్టత
- 'మీ సేవ'ల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారని సోషల్‌మీడియాలో ప్రచారం
- ప్రభుత్వం నుంచి వెలువడని ఉత్తర్వులు



మోర్తాడ్(బాల్కొండ): రేషన్ కార్డుల్లో మార్పు చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. దీంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు జారీ కాలేదు. మరణించిన వారి పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగిస్తున్నా.. పెళ్లి చేసుకుని కొత్తగా అత్తారింటికి వచ్చిన యువతులు, పుట్టిన వారు, విదేశాలకు లేదా మన దేశంలోనే దూర ప్రాంతాలకు వలసవెళ్లి తిరిగి ఇంటి బాట పట్టిన వారి పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది. అయితే తాము అధికారంలోకి వస్తే అర్హులందరికీ రేషన్ కార్డులను జారీచేయడంతో పాటు పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు చేస్తామని కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా రేషన్ కార్డుల విషయంలో సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు తప్ప అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అయితే రెండు రోజుల కింద రేషన్ పోర్టల్ ఓపెన్ అయినా కేవలం కొత్త వారి పేర్లు నమోదు చేయడానికి ఆప్షన్ ఇచ్చారు. కానీ ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు దశల వారీగా దరఖాస్తులను పరిశీలించి ఆమోదించే ఆప్షన్ మాత్రం ఇంకా ఇవ్వలేదు. సోమవారం ఈ అంశంపై స్పష్టత వస్తుందని పలువురు అనుకున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు.

పెండింగ్‌లో వేల దరఖాస్తులు

జిల్లాలోని వివిధ మీ సేవ కేంద్రాల్లో అప్‌లోడ్ అయి ఆయా అధికారుల ఆమోదం కోసం నిరీక్షిస్తున్న దరఖాస్తుల సంఖ్య 77,758 వరకు ఉన్నాయి. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ ఆరంభమైతే దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణపై కూడా ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో 3,81,224 తెల్ల రంగు రేషన్ కార్డులు ఉంటే, 20,940 అంత్యోదయ కార్డులు, 1,061 అన్నపూర్ణ కార్డులు న్నాయి. కొత్తరేషన్ కార్డులు జారీచేస్తే కార్డుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఇదిలా ఉండగా ఇప్పటికే జారీ చేసిన కార్డులతో ఎంతో మంది అనర్హులు లబ్ధి పొందుతున్నారని దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఉన్న రేషన్ కార్డుల్లో అనర్హులను గుర్తించి.. అర్హులకు కొత్త కార్డులు ఇవ్వాలని నిరుపేదలు కోరుతున్నారు.

మన్యంలో వేట..!



ఇందల్వాయి అటవీశాఖ అధికారులు పట్టుకున్న మనుబోతు మాంసం (ఫైల్)

- జిల్లాలో వేటగాళ్ల వేటుకు బలవుతున్న వన్యప్రాణులు
- అంతరించి పోతున్న అటవీ జంతువులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న జంతు ప్రేమికులు

ఇందల్వాయి: జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. వేటగాళ్ల వేటుకు అటవీ జంతువులు బలవుతున్నాయి. వేటగాళ్ల ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి వేటగాళ్లు జిల్లా అటవీప్రాంతంలో చొరబడి వన్యప్రాణులను వేటాడుతున్నారు. వన్యప్రాణులను చంపుతూ వాటి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా వేటగాళ్ల కారణంగా జిల్లాలో అడవుల్లో వన్యప్రాణులు రోజు రోజుకూ అంతరించుకుపోతున్నాయి. అటవీ సంపదపై నిఘా పెట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధానంగా వీటికే డిమాండ్

అడవుల్లో జీవించే అడవి పందులతో పాటు అరుదుగా ఉండే ఏదు, మనుబోతు, ఉడుము, మార్నాగి, కొండ గొర్రె, జింకలను వేటగాళ్లు వేటాడుతున్నారు. లభ్యత ఆధారంగా వాటి మాంసం రేట్లను వేటగాళ్లు నిర్ణయిస్తున్నారు. అడవి పంది, కొండ గొర్రె మాంసానికి కిలో నాలుగు వందలకుపైగా అమ్ముతున్నారు. ఏదు, మార్నాగి, ఉడుము మాంసం ధరలు రూ. 12 వందలకు పైగా విక్రయిస్తున్నారు.

ఫోన్‌ల ద్వారా దందా..

అటవీ జంతువుల మాంసాన్ని తినేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఒక్కోసారి వేటగాళ్లకు ముందే అడ్వాన్సులు ఇచ్చి మరీ మాంసాన్ని తెప్పించుకుంటున్నారు. వేటగాళ్లు కూడా వేట పూర్తవగానే తమ రెగ్యులర్ కస్టమర్లకు ఫోన్ ద్వారా స మాచారం అందించి మాంసాన్ని విక్రయించి సొ మ్ము చేసుకుంటున్నారు. అడవి జంతువులు సహజ సిద్ధంగా పెరగడంతో పాటు.. ఏదు, ఉడుము మాంసం నడుము నొప్పి, వాతం, నరాల బలహీనతలకు మంచిదనే అపోహ ప్రజల్లో ఉండడం కూడా ఇందుకు కారణమవుతోంది.

దాడులు జరుగుతున్నా..

వన్యప్రాణుల వేటపై అటవీశాఖ అధికారులు దాడులు జరుపుతున్నా వేట ఆగడం లేదు. కేసుల్లో విచారణ, శిక్షల అమలు అంతంత మాత్రంగానే ఉండడం.. విశ్వసనీయ సమాచారం మేరకే వేటగాళ్లను పట్టుకోవడం.. నిరంతరం పటిష్టమైన నిఘావ్యవస్థ లేకపోవడం వల్లే వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోందని విమర్శలున్నాయి. దీంతో వన్యప్రాణులు అంతరించే దశకు చేరుకున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేటగాళ్లకు కఠిన శిక్షలు అమలు చేయాలని కోరుతున్నారు.

ప్రజల సహకారం కావాలి


వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. వేటగాళ్ల కదలికల సమాచారం పొందేందుకు ప్రజలు కూడా అటవీశాఖకి సహకారం అందించాలి. నూతన చట్టాల ప్రకారం వన్యప్రాణులను చంపితే గరిష్టంగా ఐదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. వన్య ప్రాణుల పరిరక్షణ కోసం సిబ్బందితో కలిసి ప్రజలకు, రైతులకు వన్యప్రాణుల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తాం.

– రవి మోహన్ భట్, రేంజ్ అధికారి, ఇందల్వాయి

రోగాలు నయం చేసే గుణాలుండవు

కొన్ని రోగాలను నయం చేసే గుణాలు వన్యప్రాణుల మాంసంలో ఉంటాయని ప్రజలు నమ్మడంలో వాస్తవం లేదు. వాటి మాంసం కూడా చికెన్, మటన్ లాంటివే. అటవీ జంతులను ప్రత్యేకంగా తినాలనుకోవడం వేటగాళ్లను ప్రోత్సహించడమే అవుతుంది. మాంసం ఎక్కువగా తినడం వల్ల ప్రమాదకరమైన కొవ్వు, ప్రోటీన్లు ఆరోగ్యానికి హాని చేస్తాయి.

– జలగం తిరుపతి రావు, ఎండీ ఫిజీషియన్, నిజామాబాద్





రథయాత్రలో పాల్గొన్న భక్తులు

నేత్ర పర్వంగా జగన్నాథుడి రథయాత్ర

నిజామాబాద్‌అర్బన్: జగన్నాథుని రథయాత్ర జిల్లా కేంద్రంలో సోమవారం కనుల పండువగా సాగింది. ఇస్కాన్ ఇందూరు ఆధ్వర్యంలో చేపట్టిన యాత్ర భక్తుల జయజయ ధ్వానాల మధ్య వైభవంగా సాగింది. నగరంలోని పాత గంజ్ క్లాక్ టవర్ నుంచి ప్రారంభమైన యాత్ర గాంధీచౌక్, శివాజీనగర్, పులాంగ్‌చౌరస్తా, హనుమాన్ జంక్షన్ నుంచి తిరిగి పులాంగ్ చౌరస్తా మీదుగా కోర్టు చౌరస్తా, తిలక్‌గార్డెన్, దేవి రోడ్డు మీదుగా గంజ్ క్లాక్ టవర్‌కు చేరుకుంది. రథంపై జగన్నాథుడు, బలదేవ్, సుభద్రామాయి విగ్రహాలను అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. యాత్రలో భక్తులు భారీ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భజనలు, కీర్తనలు, మహా హారతి, పల్లకీసేవ, ఊంజల్ సేవతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. కార్యక్రమంలో ఇస్కాన్ నిజామాబాద్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాలో 19.2 మి.మీ. సగటు వర్షపాతం

సుభాష్‌నగర్: జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి 19.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వానాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత ఇదే వర్షపాతం అత్యధికమని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. నిజామాబాద్ సౌత్‌లో 46.8 మిల్లీమీటర్లు, పోతంగల్‌లో 44.5, నవీపేట్‌లో 41.8, మెండోరాలో 40.6 మి.మీ. వర్షం కురిసింది. నేటికీ జిల్లాలో ఏడు మండలాల్లో అత్యధిక వర్షపాతం, 16 మండలాల్లో సాధారణం, 10 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాకు ఎల్లో అలర్ట్ ప్రకటించారని, మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.

వర్షపాతం వివరాలు

మండలం	మిల్లీమీటర్లలో..				
నిజామాబాద్ సౌత్	46.8	వర్ని	27.5	నిజామాబాద్ రూరల్	17.9
పోతంగల్	44.5	నిజామాబాద్ నార్త్	26.0	ముప్కాల్	16.1
నవీపేట్	41.8	వేల్పూర్	24.3	ఆలూరు	13.4
మెండోరా	40.6	భీమ్‌గల్	24.0	డొంకేశ్వర్	13.0
చందూర్	38.9	రెంజల్	22.5	మోస్రా	12.2
సాలూర	31.3	రుద్రూర్	22.3	సిరికొండ	11.6
బోధన్	30.7	కోటగిరి	21.8	బాల్కొండ	10.9
		ఎడపల్లి	20.5	మాక్లూర్	10.8
		మోర్తాడ్	18.9	నందిపేట్	10.5

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ కోసం సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ అభ్యర్థులు ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 21న ఎంపిక పరీక్ష నిర్వహిస్తారన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్‌పై విచారణకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్‌..

నిజామాబాద్‌నాగారం: ‘ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం’ శీర్షికన సాక్షిలో ఈ నెల 7న ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్‌ అధికారులు స్పందించారు. అంగన్‌వాడీ టీచర్‌ మేరీ వ్యవహారంపై విచారణ చేపట్టనున్నట్లు ఇన్‌చార్జి సీడీపీవో నందిని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని మోచేసిన మేరీపై పదుల సంఖ్యలో బాధితులు రాతపూర్వకంగా ఈ నెల 6న ఐసీడీఎస్‌ అర్బన్‌ సీడీపీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సైతం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు దృష్టికి తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్‌: విద్యుత్‌ వినియోగాదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌ అన్నారు. పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో ఉన్న విద్యుత్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విద్యుత్‌ ప్రజావాణిని ఎస్‌ఈ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి తమ పరిధిలోని వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఎక్కువగా బిల్లులకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలాగే లో ఓల్టేజీ, పోల్‌ సమస్యలపై విన్నవిస్తున్నారన్నారు. ఏడీ శ్రీధర్‌, జేవో పోశన్న, సందీప్‌ పాల్గొన్నారు.

ఎంఈడీ పరీక్షలకు 10 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ మొదటి సెమిస్టర్‌, డిగ్రీ వన్‌ టైమ్‌ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన ఎంఈడీ సెమిస్టర్‌ పరీక్షలకు 37 మందికిగాను 27 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. అలాగే వర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన డిగ్రీ వన్‌ టైమ్‌ పరీక్షలకు 309 మంది విద్యార్థులకుగాను 294 హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులను పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్‌ హనుమంతు ఆదేశం
- అర్జీలను స్వీకరించిన అధికారులు
- 105 ఫిర్యాదులు నమోదు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్‌: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ ఎం మకరందు, డీపీవో తరుణ్‌కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు అందజేశారు.

నిధులు విడుదల చేయాలి

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌ నిధులను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లకు సంబంధించి రూ.6900 కోట్ల స్కాలర్‌ షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు విడుదల చేయాలన్నారు. ప్రైవేట్‌ కళాశాలల విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మోజీరామ్‌, శివరాజు, ప్రవీణ్‌, తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో ర్యాక్స్‌, సెల్ఫ్‌లు ఏర్పాటు చేయాలి

ప్రైవేట్‌ పాఠశాలల్లో జీవో నంబర్‌ 22 అమలు చేయాలని, విద్యార్థులపై పుస్తకాల బరువు మోసే భారాన్ని తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేశ్‌ మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలల్లో ర్యాక్స్‌, సెల్ఫ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఫీజు వివరాలను బోర్డులపై డిస్‌ప్లే చేయాలన్నారు. జిల్లా ఫీజు రెగ్యులేటింగ్‌ బోర్డు చైర్మన్‌గా కలెక్టర్‌ వ్యవహరిస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేశ్‌, నాయకులు దినేశ్‌, ఆజాద్‌, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యాపారాన్ని అడ్డుకోవాలి

ప్రైవేట్‌ పాఠశాలల్లో విద్యావ్యాపారాన్ని అడ్డుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్‌ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్‌ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావ్యాపారంపై డీఈవో మౌనం పాటిస్తున్నారని, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. పాఠశాలల్లో నోట్‌, పాఠ్యపుస్తకాలతోపాటు యూనిఫాంలు విక్రయిస్తున్నారని, ఎలాంటి రశీదులు ఇవ్వకుండా రూ.లక్షలు దండుకుంటున్నారని ఆరోపించారు.

టర్మినేట్‌ ఉత్తర్వులు నిలిపేయాలి

కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న నాన్‌ టీచింగ్‌ సిబ్బందిని టర్మినేట్‌ చేస్తూ డీఈవో ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపేయాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌ టీచింగ్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్‌ మాట్లాడుతూ.. రిటైర్మెంట్‌ వయసును 65ఏళ్లకు పెంచాలని, ఖాళీ పోస్టుల్లో రిటైర్‌ అయిన వారి కుటుంబ సభ్యులకే అవకాశమివ్వాలని కోరారు. కేజీబీవీ నాన్‌ టీచింగ్‌ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది రమ, లక్ష్మి, రుక్మ, సాయమ్మ, సునీత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

జీవో అమలు చేయాలి



కలెక్టరేట్‌ ఎదుట వీఆర్‌ఏలు

రాష్ట్రంలో వీఆర్‌ఏల వారసులకు కారుణ్య నియామకాల ఉత్తర్వుల జీవోను వెంటనే ఇవ్వాలని వీఆర్‌ఏ జేఏసీ సభ్యులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 20,555 మంది వీఆర్‌ఏలు ఉండగా, 61 ఏళ్లలోపు ఉన్న 16,758 వీఆర్‌ఏలను ప్రభుత్వం రెగ్యులర్‌ చేసిందన్నారు. 61 ఏళ్లపైబడిన వీఆర్‌ఏల వారసులైన 3,797 మందిని కూడా రెగ్యులర్‌ చేయాలని ప్రభుత్వం జీవో నంబర్‌ 81ని జారీ చేసినా ఇంతవరకు అమలుచేయడం లేదన్నారు. సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు తహసీల్‌ కార్యాలయాల నుంచి కలెక్టరేట్లు వీఆర్‌ఏల వారసుల వివరాలను సేకరించాయన్నారు. 11 నెలలు గడిచినా ఇంతవరకూ వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వుల జీవో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి జీవో ప్రకారం కారుణ్య నియామకాలు చేపట్టి, న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గంగమల్లు, సుధీర్‌, మోహన్‌, చిన్న బాలయ్య, అశోక్‌, రాములు, అబ్బులు, లక్ష్మణ్‌, హైమద్‌ అలీ, నవీన్‌, గంగాధర్‌, శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు రూ.12వేలతోపాటు బీడీ, గీత కార్మికుల లాగే పింఛన్‌ను వర్తింపజేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్‌) నాయకులు డిమాండ్‌ చేశారు. కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేసి, ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రపు సాయాగౌడ్‌, జి కిషన్‌ మాట్లాడుతూ.. దేశంలో అధికారిక లెక్కల ప్రకారం 59శాతం మంది వ్యవసాయ రంగంలో పని చేస్తున్నారని తెలిపారు. సుమారు 14 కోట్ల మంది వ్యవసాయ కూలీలే ఉన్నారని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలిని రూ.600కు పెంచాలని డిమాండ్‌ చేశారు. నాయకులు గంగన్న, రాజేశ్వర్‌, గంగమల్లు, అశోక్‌, నజీర్‌, సాయిబాబా, మోహన్‌, పోశెట్టి, ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో బదిలీలు చేపట్టాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ట్రెసా ప్రతినిధులు

సుభాష్‌నగర్‌: సాధారణ బదిలీల్లో నాయబ్‌ తహసీల్దార్లు, సీనియర్‌ అసిస్టెంట్లకు జిల్లా స్థాయిలోనే బదిలీలు చేపట్టాలని, ఇతర జిల్లాలకు బదిలీ కోరుకుంటే ఆప్షన్స్‌ ఇచ్చి బదిలీ అవకాశం కల్పించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గౌతమ్‌కుమార్‌ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బదిలీలపై నిషేదం ఎత్తేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బదిలీలకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. సంబంధిత అధికారులను ఆదేశిస్తామని, తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు సంబంధించి సీఎం దృష్టికి తీసుకెళ్లి ఎవరికీ ఇబ్బందులు లేకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ట్రెసా ప్రతినిధులు తెలిపారు. అలాగే పరస్పర బదిలీలకు కూడా అవకాశం కల్పిస్తామన్నారన్నారు. అనంతరం రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్‌ఏ నవీన్‌ మిట్టల్‌ను కలిశారు. సానుకూలంగా స్పందించిన సీసీఎల్‌ఏ నాయబ్‌ తహసీల్దార్లు, సీనియర్‌ అసిస్టెంట్ల బదిలీలను జిల్లాస్థాయిలోనే చేపడతామని, జిల్లా మారాలంటే ఆప్షన్స్‌ ఇస్తామని, ఇందుకు త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. వారివెంట ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నిరంజన్‌రావు, జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ

సుభాష్‌నగర్‌: ఇంటింటా ఇన్నోవేటర్‌ కార్యక్రమానికి ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ఇంటింటా ఇన్నోవేటర్‌ – 2024 కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. గొప్ప ఆవిష్కరణలకు ఆగస్టు 15న అవార్డు ప్రదానోత్సవం ఉంటుందని, ఈ ఏడాది కార్యక్రమంలో సరికొత్తగా జిల్లాకు ఒకరు చొప్పున 33 మంది యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నారని పేర్కొన్నారు. ఆవిష్కర్తలు వారి దరఖాస్తులను నేరుగా లేదా వాట్సాప్‌ ద్వారా 91006 78543 నంబర్‌కు పంపించవచ్చని సూచించారు. దరఖాస్తులో పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు 100 పదాలకు మించకుండా ఆవిష్కరణకు సంబంధించిన వివరణ తప్పనిసరిగా పొందుపర్చాలని అన్నారు. ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు చిత్రాలు (హై రిజొల్యూషన్‌), ఆవిష్కరణ పనితీరును ప్రదర్శించే రెండు వీడియోలు, అవసరమైన ఇతర వివరాలు పంపించాలన్నారు. ఆగస్టు 3వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, అదనపు సమాచారం కోసం 94411 91829 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ మకరంద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10న నీలకంఠేశ్వరాలయంలో వేలంపాట

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నగరంలోని నీలకంఠేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన రేకుల షెడ్డు షట్టర్‌తోపాటు రెండు ఖాళీ స్థలాలను వ్యాపారాల నిర్వహణకోసం లీజుకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 202 చదరపు గజాల రేకుల షెడ్డు షట్టర్‌, 180, 200 చదరపు గజాల వేర్వేరు ఖాళీ స్థలాలకు ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు దేవాలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీటి కాలపరిమితి 2024 ఆగస్టు 8 నుంచి 2026 జూలై 31 వరకు రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఔత్సాహిక వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెంకాయలు, పూజా సామగ్రి దుకాణానికి..

దేవస్థానం లోపల ఉన్న టెంకాయలు, పూజా సామగ్రి దుకాణం బహిరంగ వేలాన్ని సైతం 10వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని వేణు మరో ప్రకటనలో తెలిపారు. దుకాణం కాల పరిమితి 2024 ఆగస్టు 1 నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.20,000 చెల్లించాలని పేర్కొన్నారు. రథసప్తమి జాతర ఉత్సవాలు, శివరాత్రి ఉత్సవాలు కలుపుకుని పూజాసామగ్రి, కొబ్బరికాయలు అమ్ముకునేందుకు వీలుందని వివరించారు.

తండ్రి హత్యకేసులో జీవితఖైదు

కామారెడ్డి క్రైం: తండ్రిని దారుణంగా హతమార్చిన కొడుకుకి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేట గ్రామానికి చెందిన బోయిని నర్సయ్య(60) పంట పొలం వద్ద 2019 మే 7న హత్యకు గురయ్యాడు. మృతుడి కోడలు లక్ష్మి ఫిర్యాదు మేరకు బీబీపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఆస్తి పంచకుండా తనతోపాటు తన భార్యాపిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడనే కక్షతో నర్సయ్యను అతడి పెద్ద కొడుకు రాజయ్య హత్య చేసినట్లు తేల్చారు. స్థానిక సంస్థల ఎన్నికల రోజున పంటపొలాల్లోకి ఎవరూ రారని భావించి అదే రోజున పొలం పనులు చేసుకుంటున్న తండ్రి నర్సయ్యను కొట్టి చంపినట్లు నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి ఆర్‌ఆర్‌ వరప్రదద్‌ నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. కేసు పరిశోధన, సాక్ష్యాలను సక్రమంగా ప్రవేశపెట్టడంలో విశేషంగా కృషి చేసిన సీఐలు యాలాద్రి, రాజశేఖర్‌, పోలీసుల తరఫున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్‌, సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ సంపత్‌కుమార్‌, ఎస్సై ప్రభాకర్‌, కోర్టు కానిస్టేబుళ్లు నరేశ్‌గౌడ్‌, అనిల్‌ కుమార్‌లను ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

చోరీ కేసులో ఐదు నెలలు..

ఎల్లారెడ్డి: చోరీ కేసులో ఒకరికి ఐదు నెలల జైలు శిక్ష విధిస్తూ ఎల్లారెడ్డి మున్సిఫ్‌ కోర్టు న్యాయమూర్తి హారిక సోమవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. రాంపూర్‌ గ్రామానికి చెందిన పాల్‌ అలియాస్‌ ప్రవీణ్‌ గ్రామంలోని ద్యావల మీన అనే ఇంట్లోకి గత ఫిబ్రవరి 15న చొరబడి చోరీకి పాల్పడ్డాడు. నిందితుడి పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, ఐదు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

బైక్‌ అదుపుతప్పి ఒకరి మృతి

రామారెడ్డి: బైకు అదుపుతప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు. పోసానిపేట గ్రామ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌ కొండ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా సీఎస్‌ పురం మండలం శివంవారి పల్లెకు చెందిన గంజారపల్లి అనిల్‌(45) ఉపాధి నిమిత్తం మండలంలోని పోసానిపేటకు వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై ఉప్పల్‌వాయికి వెళ్లి తిరిగి వస్తుండగా పోసానిపేట ‘టీ’ జంక్షన్‌లో బైక్‌ అదుపుతప్పి అనిల్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి..



మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులకు వలచుట్టుకోవడంతో మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో గంగాధర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సింగంపల్లికి చెందిన పల్లికొండ నర్సయ్య (38) గ్రామంలోని కొచ్చెరువులో సోమవారం ఉదయం చేపల వేటకు వెళ్లాడు. చేపలకోసం వేసిన వల ప్రమాదవశాత్తు నర్సయ్య కాళ్లు, చేతులకు చుట్టుకోవడంతో నీటిలో మునిగిపోయాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నర్సయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెరువులోపడి పశువుల కాపరి..

మాక్లూర్‌: మండలంలోని మానిక్‌బండార్‌ భీం చెరువులో ప్రమాదవశాత్తు పడి సాయినాథ్‌ (31) అనే పశువులకాపరి సోమవారం మృతి చెందాడు. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోపాల్‌ మండలం కంజర్‌ గ్రామానికి చెందిన సాయినాథ్‌ బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం మానిక్‌బంఢార్‌కు వచ్చి పాలేరుగా పని చేస్తున్నాడు. రోజూలాగే పశువులను మేతకు తీసుకెళ్లగా అవి చెరువులోకి దిగాయి. పశువులను బయటకు వెళ్తుండగా సాయినాథ్‌ నీటమునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్రాసిటీ కేసులో నలుగురి రిమాండ్‌

నందిపేట్‌(ఆర్మూర్‌): మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన నలుగురిని అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తల్వేద గ్రామ పరిధిలోని 539/1, 539/3/1, 539/4/1 సర్వేనంబర్లలో బొమ్మన పెద్దన్నకు 4.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో నుంచి కొందరు దౌర్జన్యంగా దారి వేస్తుండగా పెద్దన్న అడ్డుచెప్పడంతో సదరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడి భార్య పోసాని పోలీసులకు ఫిర్యాదు చేయగా, చిక్లి చిన్నరాజన్న, నడిసెరం పెద్ద చిన్నయ్య, మగ్గిడి నడ్పి రాజన్న, గోవుల పోతన్నను పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

మాక్లూర్‌: మండలంలోని అడవిమామిడిపల్లి శివారులోని రహస్య ప్రాంతంలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై సోమవారం దాడి చేసి ఐదుగురిని అరెస్ట్‌ చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ విష్ణుమూర్తి తెలిపారు. పట్టుబడిన వారితోపాటు వారి నుంచి స్వాధీనం చేసుకున్న రూ.14వేల నగదు 5 సెల్‌ఫోన్లను మాక్లూర్‌ పోలీసులకు అప్పగించామన్నారు. దాడిలో సీఐ పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్‌ లస్మన్న, రాజేశ్వర్‌, గజేందర్‌, అనిల్‌, అజాం పాల్గొన్నట్లు తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి రూ.4లక్షలు చోరీ

- నవీపేటలోని సుభాష్‌నగర్‌లో ఘటన



నవీపేటలో స్థానికులను విచారిస్తున్న పోలీసులు

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు రూ.4లక్షలు ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై యాదగిరిగౌడ్‌ వెల్లడించారు.. బీడీ కంపెనీలో ప్యాకర్‌గా పని చేసే సయ్యద్‌ మీర్‌ హౌసింగ్‌ లోన్‌ చెల్లించేందుకు రూ.4 లక్షలు అప్పుగా తీసుకువచ్చి ఇంట్లోని బీరువాలో దాచాడు. నందిపేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు ఆదివారం రాత్రి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి అందులోని రూ.4 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చిన సయ్యద్‌ మీర్‌ చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.క్లూస్‌ టీమ్‌ వేలిముద్రలను సేకరిచించింది. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు వెళ్లి వచ్చే సరికి..

ఖలీల్‌వాడి: బావను దుబాయ్‌ ఫ్లైట్‌ ఎక్కించి ఇంటికి వచ్చే సరికి దుండగులు చోరీకి పాల్పడిన ఘటన నగరంలోని ఆటోనగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆరో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన రఫీక్‌.. తన బావ దుబాయికి వెళ్తుండడంతో ఆయనను ఫ్లైట్‌ ఎక్కించేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌ ఎయిర్‌పోర్ట్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరిగి ఇంటికి చేరుకోగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా నుంచి 20 తులాల బంగారం, వెండి, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మొగులయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- అటవీ అధికారులు వేధిస్తున్నారని ఆరోపణ
- అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్న అధికారులు



శోభన్‌తో మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌వో ఓంకార్‌

ఎల్లారెడ్డి: పాత టేకు కర్రలను తీసుకెళ్తున్న తనను పట్టుకొని అటవీ అధికారులు వేధిస్తున్నారని గాంధారి మండలం గండివేట్‌కు చెందిన యువకుడు నామాల శోభన్‌ ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టణంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. శోభన్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తన బైక్‌పై పాత టేకు కర్రలను తీసుకుని వస్తుండగా బేస్‌ క్యాంపు అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారని, పాత కర్రలు తీసుకెళ్తున్నానని చెప్పినా వినకుండా అధికారులు రూ.20వేలు డిమాండ్‌ చేశారని శోభన్‌ ఆరోపించాడు. తన వద్ద ఉన్న రూ.2వేలు తీసుకుని విడిచిపెట్టాలని వినకుండా బైక్‌తోపాటు పాత టేకుకర్రలను అటవీశాఖ కార్యాలయానికి తీసుకువచ్చారని తెలిపాడు. సాయంత్రం వరకు అధికారులు రాకపోగా, తన బాధను ఎవరూ వినకపోవడంతో ఒంటిపై పెట్రోల్‌ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశానని పేర్కొన్నాడు. దీనిపై ఎఫ్‌ఆర్‌వో ఓంకార్‌ను వివరణ కోరగా, బైక్‌పై టేకు కర్రలు తరలిస్తుండగా పట్టుకోవడంతో తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. శోభన్‌ను ఎవరూ డబ్బులు అడగలేదని స్పష్టం చేశారు.

లైంగికంగా వేధించి.. ఆస్తి కాజేశాడు

మోర్తాడ్‌(బాల్కొండ): వితంతును లైంగిక వేధించి ఆస్తి కాజేసిన ఘటన ఏర్గట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. తపాల శాఖలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి గ్రామంలోని ఓ వింతతుపై కన్నేశాడు. ఆమెపై పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఆమె వద్ద ఉన్న ఇంటి స్థలాలు, నగదు, నగలు ఇలా దాదాపు రూ.50లక్షల విలువైన ఆస్తిని కాజేశాడు. ఎవరికైన చెబితే ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరించాడు. నిందితుడి కుటుంబ సభ్యులు కూడా బాధితురాలిపై దాడి చేశారు. దీంతో ఆమె ఆదివారం ఏర్గట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుడిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు.

తెయూ హాస్టల్‌ విద్యార్థి సస్పెండ్‌

- బాలుర హాస్టల్‌లో బాలికకు వసతి
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యూబాయ్స్‌ హాస్టల్‌ విద్యార్థిని క్రమశిక్షణ చర్య కింద వర్సిటీ ఉన్నతాధికారులు సస్పెండ్‌ చేశారు. 15 రోజుల కింద జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్సిటీ విద్యార్థులు తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి తెయూలో బోటనీ ఫైనలియర్‌ చదువుతూ క్యాంపస్‌లోని న్యూ బాయ్స్‌ హాస్టల్‌లో ఉంటున్నాడు. అతడితో కలిసి డిగ్రీ చదివిన స్నేహితురాలు సుమారు 15 రోజుల క్రితం యూనివర్సిటీకి వచ్చింది. అప్పటికే రాత్రి కావడంతో ఆమెను తన గదిలోనే ఉంచాడు. మరుసటి రోజు ఉదయం హాస్టల్‌లో బాలిక ఉండటం గమనించిన విద్యార్థులు విషయాన్ని వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయం బయటకు పొక్కడంతో రిజిస్ట్రార్‌ యాదగిరి చర్యలు తీసుకున్నారు. విద్యార్థిని హాస్టల్‌తో పాటు యూనివర్సిటీ నుంచి సస్పెండ్‌ చేసినట్లు రిజిస్ట్రార్‌ తెలిపారు. ఈ విషయంలో హాస్టల్‌ సెక్యూరిటీ సిబ్బందితో పాటు వార్డెన్‌ నిర్లక్ష్యం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా సస్పెండ్‌కు గురైన సదరు విద్యార్థి నాలుగైదు రోజులుగా వర్సిటీ క్యాంపస్‌లోనే తిరుగుతున్నట్లు సమాచారం. తనను పరీక్షలు రాయనివ్వాలని బోటనీ విభాగాధిపతి, వర్సిటీ ఉన్నతాధికారులకు మొరపెట్టుకోగా తిరస్కరించినట్లు తెలిసింది.

రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని జగిత్యాల – కోరుట్ల ప్రాంతంలో రైలుకు ఎదురెళ్లి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఎకిన్‌పూర్‌ గ్రామానికి చెందిన నర్సయ్య(41)కు మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో ఆయన రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్‌

జక్రాన్‌పల్లి: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని మండలంలోని మనోహరాబాద్‌ శివారులో అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. మనోహరాబాద్‌ గ్రామ శివారులోని సాయిబాబా ఆలయం వద్ద వేల్పూర్‌ మండలంలోని పచ్చల నడ్కుడకు జల్సా శేఖర్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 1.2 కేజీల గంజాయి లభించిందన్నారు. శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.